# అంతర్మధనం

## -సూరేపల్లి విజయ

ఆశ్రమం గేటు దగ్గర ఒక స్త్రీ ఇద్దరు పిల్లలతో నిలబడి వుంది. నేను చాలాసేపటి నుండి గమిస్తున్నాను. లోపలికి రావడంలేదు. బయటకు వెళ్లడంలేదు. అక్కడే నిలబడింది. ''లోపలికి రామ్మా'' అన్నాను. బెరుకు బెరుకుగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది.

''ఏం కావాలమ్మా?'' అని అడిగాను.

భోరున ఏడ్చింది.

''చెప్పమ్మా భయంలేదు'' అన్నాను.

అప్పటికి ఏడుపు ఆపి ''నా భర్త చనిపోయారమ్మా. ఏ ఆధారం లేకుండా దిక్కులేనివాళ్లమయ్యాం. మీరు ఏదైనా దారి చూపిస్తారని వచ్చాను'' అన్నది.

''చూడమ్మా! నీకు ఏదైనా పని దొరికేవరకూ ఇక్కడే వుండవచ్చు. నీ కాళ్ల మీద నువ్వు నిలబడ్డ తరువాత వెళ్లిపోవాలి. నీవు సంపాదనపరురాలివయ్యాక నీ వంతు సహాయం ఈ ఆశ్రమానికి చెయ్యాలి. లోపలికెళ్లు. నీవేం చేయాలో చెప్తారు'' అన్నాను.

నమస్కరిస్తూ లోపలకెళ్లిపోయింది.

తరాలు మారినా ఆడదాని తలరాత మారలేదు. ఆడది ఎప్పుడూ విధివంచితురాలే. ఆడదానిగా పుట్టే బదులు అడవిలో మానై పుట్టడం నయమని ఎంత అనుభవంతో చెప్పారు. సహనానికి మారుపేరు ఆడది. ఆ సహనానికి పరీక్ష పెడతాడు దేవుడెందుకో?

★★★

నా భర్త సడెన్‌గా గుండెజబ్బుతో చనిపోయారు. ఇద్దరు పిల్లల తల్లినయిన నన్ను ఏ ఒక్కళ్లూ ఆదరించలేదు. ఓదార్చలేదు. అండగా నిలబడలేదు. బంధువులయితే రాబందులే అయ్యారు. గ్రాట్యుటీ, పి.ఎఫ్ డబ్బువస్తే దానిని కాజేయడానికి చూసారు. అది జాగ్రత్త చేసుకోవడానికి, నా కాళ్లమీద నేను నిలబడడానికి చీకటిలో చిరుదీపంలా 'అతను' కనిపించాడు. నాకు అండగా నిలబడ్డాడు. ఉద్యోగం చూపించాడు. అప్పుడప్పుడు మా ఇంటికి వస్తున్నాడు. ''ఏం చేస్తే ఏం మీద పడుతుందో'' అని అందరూ దూరంగా వున్న తరుణంలో అతను కొండంత ధైర్యానిచ్చాడు. అతనితో చనువుగా వున్నాను అనేకంటే పరిస్థితులే అలా కలసి వచ్చాయి అంటే బాగుంటుంది.

ఒకరోజు అతను నేను కలసి పిల్లలకు పుస్తకాలు, బట్టలు కొనుక్కొని ఇంటికి వచ్చాము. అప్పటికే చీకటి పడింది. సన్నగా వర్షం మొదలయింది. అది రానురాను ఉరుములు మెరుపులతో పెద్దదయింది. ఎంతకూ తగ్గడంలేదు. మాతోపాటు భోజనం చేసాడు. అతను కథలు చెబుతుంటే పిల్లలు వింటూ నిద్రపోయారు.

''మీరు ఇక్కడే పడుకోండి. చాలా రాత్రయింది'' అని ముందు గదిలో మంచం వేసాను. ఇంతలో కరెంట్ పోయింది. అగ్గిపెట్టె కోసం వెతుకుతున్నాను. ఎంత వెతికినా చీకట్లో కనిపించడంలేదు.

అగ్గిపెట్టెకి ముందుకు చాచిన నా చెయ్యి అతని మీద పడింది. ఆ చెయ్యిని అతను అలాగే గట్టిగా పట్టుకున్నాడు. రెండో చేతితో నన్ను మరింత దగ్గరకు తీసుకున్నాడు. అలా దగ్గరకు తీసుకోగానే నాలో నిద్రాణమైన కోరికలు చెలరేగాయి. అతనిని మరింత హత్తుకుపోయాను. నా నుండి సహకారం దొరకగానే అతనిలోని 'మగాడు' విజృంభించాడు.

''శంఖంలాంటి నీ మెడ చాలా బాగుంది'' అని చెవిలో గుసగుసగా అన్నాడు.

నడుముమీద చెయ్యివేసి తనకనుకూలంగా నన్ను తిప్పుకున్నాడు.

''పర్వతాలు వెన్నముద్దల్లా వున్నాయి'' అన్నాడు.

''నీ నడుము నా చేతిలో ఇమిడిపోయింది'' అన్నాడు.

నేను వివశురాలినే అయ్యాను. పరిసరాలను మరిచాను. రొమాంటిక్ గేమ్ మధురంగా ముగిసింది.

కానీ మదిలో అంతర్మధనం మొదలయ్యింది. సెక్స్ సుఖం అనుభవించినందుకు సంతోషపడనా లేక కోరికలు అదుపులో పెట్టుకోలేకపోయినందుకు బాధపడనా?

నాకే తెలియని అయోమయ పరిస్థితిలో అలాగే కూర్చుండిపోయాను.

అతను నా దగ్గరకొచ్చి ''బాధపడ్తున్నావా?'' అన్నాడు.

ఏం చెప్పాలో తెలియలేదు.

''నా భార్యను ఎలా చూసుకుంటానో నిన్నూ అలాగే చూసుకుంటాను.''

''కానీ సమాజం భార్య అనదుగా?''

''నీకు భార్య స్థానం కావాలంటే నిన్ను పెళ్లి చేసుకుంటాను.''

''మీకు భార్యాపిల్లలు వున్నారుగా?''

''ఎంతమందికి ఇద్దరు భార్యలు లేరూ?''

''నాకు అంత అదృష్టం కలిగిస్తారా?''

''తప్పకుండా''

★★★

మరునాడు దేవుడి గుళ్లో నా మెడలో మూడుముళ్లు వేసాడు. మా పెళ్లికి దేవుడే సాక్షి. ఇంక ఎవరూలేరు. అలా ఇల్లాలినయ్యానని తృప్తిపడ్డాను. నేను మళ్లీ బొట్టు, గాజులు పెట్టుకున్నాను. అతను వాళ్ల కుటుంబంతోనే వుంటున్నాడు. నా పిల్లలు పెద్దవాళ్లయ్యాక నన్ను తనతో తీసుకువెళ్తానన్నాడు. నా పిల్లలకు ఇప్పుడు నా అవసరం వుందికదా. 'సరే' అనుకున్నాను. అప్పుడప్పుడు అతను నా దగ్గరకు వస్తున్నాడు.

అతని రాకతో ఇరుగుపొరుగు వారు నన్ను వెలివేసారు. ఎవరూ నాతో మాట్లాడ్డంలేదు. పిల్లలు పెద్దవాళ్లవుతున్నారు. కాలేజీ చదువులకొచ్చారు.

పెద్దవాడు ఇంటికి సరిగ్గా రాడు. ఎక్కడికి వెళ్తాడో తెలియదు. అడిగితే 'నా గురించి నీకెందుకు? అడిగే అర్హత నీకు లేదంటాడు'. అసలు చదవడు. వాడి దగ్గర ఎప్పుడూ సిగరెట్ వాసన వస్తుంది. ఇంకేం అలవాట్లున్నాయో నాకు తెలియదు.

ఇక చిన్నవాడు ఎప్పుడూ స్తబ్దుగా ఉంటాడు. ఉలకడు, పలకడు. ''అలా వుంటావేరా?'' అంటే ''స్కూల్లో అందరూ మీ మమ్మీ మంచిదికాదు. నీతో మాట్లాడకూడదు అంటూ హేళన చేస్తున్నారు'' అన్నాడు.

ఇలాంటి వాతావరణంలో పిల్లలు పెరిగి పెద్దవాళ్లయ్యారు. ఎవరికి వాళ్లు పెళ్లిళ్లు చేసుకుని స్థిరపడ్డారు. నా ఉనికి వాళ్లకు సరిపడదు. వాళ్లకోసం నేను ఎంత కష్టపడ్డాను. నా శ్రమను వాళ్లు గుర్తించలేదు. వాళ్ల దృష్టిలో నా సుఖం నేను చూసుకున్న మనిషిని. అయినా చలించలేదు. నా అవసరం ఇక పిల్లలకు లేదు. అతను అప్పుడు చెప్పినట్లు నన్ను అతని దగ్గరకు తీసుకువెళ్తాడనుకున్నాను. భార్యగా నా స్థానాన్ని నాకిస్తాడనుకున్నాను.

అతని సాన్నిధ్యంలో అన్నీ మరచిపోయి ప్రశాంతంగా వుండాలనుకున్నాను.

కానీ నా గాలిమేడలన్నీ పేక మేడల్లాగా కూలిపోయాయి. అతను ఇప్పుడు నా దగ్గరకు రావడంలేదు. ఎప్పుడైనా కలిసినా తప్పించుకని తిరుగుతున్నాడు.

నన్ను తీసుకెళ్లమని నిలదీస్తే సంఘంలో తన విలువ పోతుందన్నాడు. ''నా భార్య ఊరుకోదు. ఇన్నాళ్లు నీకు సెక్స్ సుఖం ఇచ్చాను. దాంతో తృప్తిపడు. ఇంకెప్పుడూ నన్ను కలవకు'' అన్నాడు.

నేను అతని మాటలకు హతాశురాలిన య్యాను. ఎవ్వరికీ చెప్పుకోలేని పరిస్థితి. నేను అతని భార్యను అని చెప్పుకోవడానికి నా పెళ్లికి సాక్ష్యం ఎవ్వరూలేరు. నాలో నేనే కుమిలిపోయాను.

అతను మంచితనానికి మారుపేరనుకున్నాను. దైవానికి ప్రతిరూపమనుకున్నాను. అలా అనుకునే నా సర్వస్వాన్ని అర్పించాను. నేను యవ్వనంలో ఉన్నన్నాళ్లూ నన్ను వాడుకున్నాడు. భార్యతో బోర్ కొట్టినప్పుడల్లా నా దగ్గరకు వచ్చేవాడు. నాతో అమరసుఖాలు పొందేవాడు. ఇప్పుడు నాతో అవసరం తీరిపోయింది. ఏరు దాటిన తరువాత తెప్ప తగలేసాడు.

లోకం నన్ను మాత్రమే పతిత అన్నది. అందరూ నాదే తప్పు అన్నారు. ఆ తప్పు అతనుకూడా చేసాడు. అయినా శిక్ష మాత్రం నాకొక్కదానికే. అతను సమాజంలో పెద్దమనిషిలా బాగానే వున్నాడు. నేను మాత్రం ఆడవాళ్ల సానుభూతి కూడా కోల్పోయాను.

ఎవరో ఎందుకు నా కన్నపిల్లలే నన్ను వెలివేసారు. నాదే తప్పంటున్న ఈ సమాజం ఏ ఆపదలోనూ నన్ను ఆదుకోలేదు.

ఇప్పుడు నేను ఒంటరిని. పిల్లలు వెళ్లిపోయారు. అతను తృణీకరించాడు. నేను పోయినా రెండు కన్నీటి చుక్కలు రాల్చేవాళ్లు లేరు. ఎవరికోసం బ్రతకాలి? ఎందుకోసం బ్రతకాలి?

కానీ బ్రతకాలి. నా కోసం బ్రతుకుతాను. ఇన్నాళ్లు అందరి కోసం బ్రతికాను. ఇప్పుడు నా తృప్తి కోసం బ్రతుకుతాను. భయపడితే లోకం తరిమి తరిమి కొడుతుంది. అదే ఎదురు తిరిగితే తోక ముడుచుకుని పారిపోతుంది.



వృద్ధాప్యమే శాపంగా బ్రతుకుతున్న వాళ్లెందరో ఉన్నారు. వాళ్లకు చేయూతనిస్తాను. నాలాంటి ఒంటరివాళ్లకు అండగా వుంటాను. నావల్ల నలుగురికి ఉపయోగపడే పనులు చేస్తాను. ఆనాటి ఆలోచనే ఈనాటి ఈ ఆశ్రమం.

ఒకనాడు నేను ఒంటరిని అనుకున్నాను. కానీ ఈనాడు ఆశ్రమంలో నాకెందరో ఉన్నారు. అందరూ నావాళ్లే. నన్ను నమ్ముకుని నా సహాయం కోరి వచ్చినవాళ్లే. ఎంతోమంది దాతల చలువవలన ఈ ఆశ్రమం మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తోంది. చిన్న వయసు నుండి వృద్ధులవరకూ ఎంతోమంది ఈ ఆశ్రమంలో వుంటున్నారు. వాళ్లను కొంతవరకైనా ఆదుకోగలిగాననే తృప్తి నాకుంది. తృప్తికి మించింది లేదు. ఆ తృప్తి నాకు లభించింది. ఈ జన్మకిది చాలు! ★